నమస్తే తెలంగాణ
కరీంనగర్
3 | కరీంనగర్, శనివారం 6 ఏప్రిల్ 2024 | KARIMNAGAR




బోయినపల్లిలో రైతులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

'సార్ మీరే మాధైర్యం. మీతోనే మేముంటం' అంటూ రైతు బాంధవుడు, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు ఉమ్మడి జిల్లా రైతులు తేల్చిచెప్పారు. నీళ్లు లేక ఎండిన పంటలను పరిశీలించేందుకు శుక్రవారం మధ్యాహ్నం ఆయన ఎర్రటెండలో ఉమ్మడి జిల్లాకు రాగా, ఉద్వేగానికి లోనయ్యారు. పదేళ్లలో తమకు ఏ కష్టం రాలేదని, నీళ్లు, కరెంట్‌కు గోసపడ లేదని, రైతుబంధు ఇచ్చి పెట్టుబడికి రంది లేకుండా చేశారని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు నీళ్లు లేక పంటలు ఎండిపోయి తమ గోడు వెల్లబోసుకున్నారు. రైతుల కష్టాలను చూసి చలించిపోయిన కేసీఆర్, మీకు అండగా ఉంటానని, అధైర్య పడొద్దని భరోసా నిచ్చారు. రైతుల బతుకులు ఆగం చేస్తున్న ప్రభుత్వంపై పోరాటం చేద్దామని పిడికిలి బిగించి పిలుపునివ్వగా, 'మీతోపాటే మేం నడుస్తం' అంటూ రైతులు నినదించారు.



కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న కేసీఆర్, చిత్రంలో గంగుల కమలాకర్, వినోద్ కుమార్



- చేసిన తప్పు మరోసారి చేయం
- రైతుబాంధవుడు కేసీఆర్‌తో తేల్చిచెప్పిన రైతులు
- యుద్ధానికి సిద్ధమని నినాదాలు

# మీరే మా ధైర్యం
# మీ వెంటే నడుస్తం

కరీంనగర్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : నీళ్ల లేక పంటలు ఎండిపోయిన రైతులకు అండగా నిలించేందుకు పొలంబాట పట్టిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, శుక్రవారం ఎర్రటి ఎండను లెక్కచేయకుండా కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో పర్యటించారు. పంటలను పరిశీలిస్తూ.. రైతులకు ధైర్యం చెబుతూ ముందుకు సాగిన ఆయనకు దారిపొడవునా.. రైతులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ముందుగా కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌కు చేరుకున్న ఆయన, రైతులు పొలగాని సంపత్, బండి సంపత్, వేల్పుల నర్సయ్యకు సంబంధించిన ఎండిన పంటలను పరిశీలించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నీళ్లు రావడం లేదనే విషయం రైతులు చెప్పగానే.. మరి ఏం చేద్దామని ప్రశ్నించారు. 'ఈ ప్రభుత్వంపై యుద్ధం చేద్దామా..?' అని అడిగినప్పుడు.. చేద్దామంటూ రైతులు స్పష్టం చేశారు. 'కేసీఆర్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. అనంతరం కేసీఆర్ కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసానికి చేరుకున్నారు. మధ్యాహ్న భోజనం చేసి సిరిసిల్ల జిల్లాకు వెళ్తుండగా, అప్పటికే కార్యకర్తలు, ప్రజలు దారి వెంట జేజేలు పలికారు. అందరికీ అభివాదం చేస్తూ కేసీఆర్ బస్సు ఎక్కుతుండగా.. 'కేసీఆర్ జిందాబాద్, సీఎం కేసీఆర్' అంటూ పెద్దఎత్తున నినదించారు. జగిత్యాల మార్గంలో గంగాధర మీదుగా సిరిసిల్ల వెళ్తూ రామడుగు మండలం వెదిర వద్ద చొప్పదండి నియోజకవర్గ కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. వెదిరతో పాటు గంగాధర మండలం కురిక్యాల వద్ద ఎండిన వరి కంకులను చేతబట్టుకుని నిలబడిన రైతులను చూసి కేసీఆర్ బస్సును ఆపించి మాట్లాడారు. 'ఎన్ని ఎకరాల్లో పంటలు వేశారు? ఎన్ని ఎకరాల్లో ఎండిపోయాయి' అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు ఉద్వేగానికి లోనయ్యారు. 'సారు మీరు ఉన్న పదేళ్లలో మాకు ఏ కష్టం రాలేదు. నీళ్లిచ్చిన్రు. కరెంట్ ఇచ్చిన్రు. పెట్టుబడి కోసం రైతు బంధు ఇచ్చిన్రు. కానీ, ఇప్పుడు నారాయణపూర్ రిజర్వాయర్ ఎండిపోయింది. వరద కాలువలో నీళ్లు లేవు. పంటలు ఎండిపోతున్నయి' అని చెప్పుకున్నారు. 'మరి యుద్ధం చేద్దామా..?' అని కేసీఆర్ ప్రశ్నించగా.. 'చేద్దాం సార్.. ఇక నుంచి మీ వెంటే మేం ఉంటం. మీ వెంటే నడుస్తం' తేల్చి చెప్పారు. అనంతరం అధినేత బోయినపల్లి శివారులో ఎండిన పంటలను పరిశీలించగా, రైతులు ఉద్వేగానికి లోనయ్యారు. 'సార్ మేం కాంగ్రెస్‌కు ఓటేసి పొరపాటు చేసినం. నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నయి. కరెంట్ సరిగ్గా లేదు. మళ్లీ ఆ తప్పు చేయం' అంటూ స్పష్టం చేశారు. 'కేసీఆర్ జిందాబాద్' 'వద్దురా కాంగ్రెస్ పాలన' అంటూ నినదించారు. మీ కష్టాల్లో నేను పాలుపంచుకుంటానని కేసీఆర్ అభయమిచ్చారు.



మాజీ సీఎం కేసీఆర్‌కు తన బాధను వివరిస్తున్న రైతు వెంకట్‌రెడ్డి

## పదెకరాలకు ఆరెకరాలు ఎండింది

- సీఎం కేసీఆర్‌కు గోడు వెల్లబోసుకున్న రైతు వెంకట్‌రెడ్డి

కొడిమ్యాల, ఏప్రిల్ 5 : 'సార్.. నేను పదెకరాల వరి పంట సాగు చేస్తే నీళ్లు లేక ఆరెకరాలు పూర్తిగా ఎండింది' అంటూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎదుట కొడిమ్యాల మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన రైతు చల్లా వెంకట్‌రెడ్డి తన గోడు వెల్లబోసుకున్నాడు. పంటలను పరిశీలించడానికి కేసీఆర్ శుక్రవారం బోయినపల్లికి రాగా, ఆయనతో ఉద్వేగంగా మాట్లాడాడు. తన పొలం పక్కనే ఎల్లంపల్లి గ్రావిటీ కెనాల్ ఉందని, గతంలో అందులో నీళ్లు పారుతుంటే ఒక గుంట ఎండకుండా పొలాన్ని పారించుకున్నానని చెప్పుకున్నాడు. ఈ యాసంగిల నీళ్లు రాకపోవడంతో పొలం ఎండిపోయిందని, పెట్టిన పెట్టుబడి మీద పడిందని ఆవేదన వ్యక్తం చేశాడు.



శాభాష్‌పల్లి వంతెన పైనుంచి పరిశీలిస్తున్న కేసీఆర్

## నీళ్లు లేని మిడ్‌మానేరు చూసి ఆవేదన

బోయినపల్లిలో పంటలను పరిశీలించి వెళ్తూ.. బోయినపల్లి మండలం శాభాష్‌పల్లి వంతెన వద్ద ఆగారు. నీళ్లు లేక వెలవెల బోతున్న శ్రీరాజరాజేశ్వర (మిడ్‌మానేరు) జలాశయాన్ని పరిశీలించి చలించిపోయారు. నాడు గోదావరి జలాలతో సముద్రాన్ని తలపించేదని, అప్పుడు నిండుకుండలా మారిన జలాశయాన్ని కండ్లారా చూస్తూ తన్మయత్వం చెందిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు ఎడారిలా మారిందని ఆవేదన చెందారు. ఇది సర్కారు వైఫల్యమేనంటూ మండిపడ్డారు.

# యుద్ధానికి సిద్ధంకండి

- పంటలు ఎండాయని అధైర్య పడద్దు
- మీ బాధలు తీర్చే వరకు అండగా నేనుంట
- రైతులందరూ ఏకం కావాలి
- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్
- మొగ్దుంపూర్, బోయినపల్లిలో ఎండిన పంటల పరిశీలన


'రైతులు పంటలు ఎండిపోయాయని అధైర్య పడవద్దు. మీ బాధలు తీర్చే వరకు అండగా ఉంట. నష్టపోయిన పంటలకు ఎకరానికి ₹25 వేల పరిహారం ఇవ్వాలని కోరుదాం. మంచి మాటతో వినకపోతే పోరాడుదాం. మీరంతా యుద్ధానికి సిద్ధమా..' అని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. పొలంబాటలో భాగంగా శుక్రవారం ఆయన ఎర్రటి ఎండలో మొగ్దుంపూర్‌తోపాటు బోయినపల్లిలో ఎండిన పంటలను పరిశీలించారు. సాగునీటి కోసం రైతులు పడుతున్న గోసను చూసి చలించిపోయారు.

కరీంనగర్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): పంటలు ఎండిపోయాయని రైతులు అధైర్య పడవద్దని, పోరాటం చేసి నష్టపరిహారం సాధించుకుందామని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు ధైర్యం చెప్పారు. శుక్రవారం ఆయన కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌లో రైతులు పొలగాని సంపత్, బండి సంపత్, వేల్పుల నర్సయ్యకు సంబంధించిన పొలాలను పరిశీలించి చలించి పోయారు. ఈ సందర్భంగా రైతులు తమ బాధలను ఏకరువు పెట్టారు. ఎకరానికి ₹25వేల నుంచి ₹30 వేల పెట్టుబడి పెట్టామని, ఇప్పుడు అవి మునిగామని వాపోయారు. మీరు ఎన్ని ఎకరాలు వేశారని పొలగాని సంపత్‌ను కేసీఆర్ అడుగగా, మూడెకరాలు వేస్తే మొత్తం పోయిందని, పాల పొట్ట మీద ఉన్న పంటంతా ఎండిపోయిందని ప్రత్యక్షంగా చూపించాడు. ఒక్క రెండు తడులైతే పంట చేతికి వచ్చేదని వాపోయాడు. బండి సంపత్, వేల్పుల నర్సయ్యను కూడా కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. చుట్టుపక్క ఉన్న పొలాలు, ఇతర గ్రామాల రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉందని స్థానిక తాజా మాజీ సర్పంచ్ జక్కం నర్సయ్య వివరించాడు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎస్సారెస్పీ ద్వారా క్రమం తప్పకుండా నీళ్లు వచ్చాయని, మానేరువాగులో జలధార ఎన్నడూ ఎండిపోలేదని గుర్తు చేశాడు. గ్రామంలో ఎన్ని ఎకరాల్లో వరి వేశారని కేసీఆర్ అడుగగా, సుమారు 2 వేల ఎకరాల్లో వేశారని, అందులో 80 శాతం పంటలు నీళ్ల లేక ఎండిపోయాయని చెప్పాడు. నగునూర్, గోపాల్‌పూర్, ఇరుకుల్ల, మొగ్దుంపూర్ గ్రామాల పరిధిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాలుగు చెక్ డ్యాంలు నిర్మించిందని, ఆరేండ్ల నుంచి అవి ఎన్నడూ ఎండిపోలేదని, రైతులకు ఎలాంటి ఇబ్బందులూ రాలేదని కరీంనగర్ సింగిల్ విండో చైర్మన్ శ్యాంసుందర్ వివరించారు. ఇప్పుడు చెక్‌డ్యాంలు పూర్తిగా ఎండిపోయాయని, మానేరు ఒడ్డున ఉన్న పొలాలు కూడా నెర్రెలు బారాయని చెప్పారు. పంటలు ఎండిన విధానాన్ని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ కూడా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తమపై కక్ష కట్టినట్లే వ్యవహరిస్తున్నదని, నీళ్లున్నా ఇవ్వలేదని, రెండు తడులు ఇస్తే పంటలన్నీ చేతికి వచ్చేవని రైతులు వాపోతుండగా కేసీఆర్ స్పందించారు. మరీ ఇప్పుడు ఏం చేద్దాం..? యుద్ధం చేద్దామా..? అని ప్రశ్నించగా, రైతులు ముక్తకంఠంతో చేద్దామని మద్దతు పలికారు. అంతేకాకుండా, ఎకరానికి ₹25 వేల నష్టపరిహారం అడుగుదామని, మంచి మాటతో వినకపోతే పోరాటం చేద్దామని, మీరంతా ఏకం కావాలని రైతులకు పిలుపునివ్వగా.. తామంతా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సర్కారు సంగతేందో చూద్దామని, మీరంతా రెడీగా ఉండాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత పది వేల మందితో మేడిగడ్డకు వెళ్లి ధర్నా చేద్దామన్నారు. నీళ్లు ఇవ్వడం ఈ రండగాళ్లతో కాదని, వచ్చే తాపకు మనమే వెళ్లి నీళ్లను మలుపుకుందామని, ఎవడన్నా అడ్డం వస్తే అక్కడే చెట్టుకు కట్టేద్దామని స్పష్టం చేశారు. కేసీఆర్ వెంట బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, బాల్క సుమన్, ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, బీఆర్‌ఎస్ నాయకులు సర్దార్ రవీందర్‌సింగ్, చల్మెడ లక్ష్మీనర్సింహారావు, కరీంనగర్ మేయర్ వై సునీల్‌రావు ఉన్నారు.



పోరాటానికి సిద్ధం కావాలని పిడికిలి బిగించి నినదిస్తున్న కేసీఆర్

## అయ్యో.. వరద కాలువ ఇట్లయ్యిందా?



మొగ్దుంపూర్ పర్యటన తర్వాత సిరిసిల్లకు వెళ్తున్న కేసీఆర్, గంగాధర మండలం కురిక్యాల – కొండన్నపల్లి గ్రామాల మధ్య వరద కాలువను బస్సులో నుంచి పరిశీలించి చలించి పోయారు. 'అయ్యో.. వరద కాలువ పరిస్థితి ఇంత దారుణంగా తయారైందా..? ఎండకాలం కూడా నిండుగా నీళ్లతో ఉండేది' అని ఆవేదన చెందారు. వరద కాలువ పూర్తిగా ఎండిపోయిందని, దీనిపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్న అన్ని గ్రామాల్లో పంటలు ఎండి పోయాయని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వివరించగా.. కేసీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సర్కార్ వైఫల్యమనేనని స్పష్టం చేశారు.

## ఎవుసం ఆగమైంది : బోయినపల్లిలో రైతుల ఆవేదన

డ్యామ్ పక్కనే ఉన్నా నీటి చుక్క లేక , కరెంటు సరిగ్గా లేక పంట పొలాలు ఎండుతున్నాయని బోయినపల్లిలో కేసీఆర్ ఎదుట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎవుసం ఆగమైందని వాపోయారు. నాలుగేళ్ల నుంచి ఏటా రెండు పంటలు పండించానని తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన గంగు రమేశ్ గుర్తు చేశాడు. తన రెండెకరాలు మిడ్‌మానేరుల ముంపునకు గురైందని, ఉపాధి కోసం బోయినపల్లికి వచ్చి పదెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నానని చెప్పుకున్నాడు. కోరెం కిష్టమ్మ చెరువు నుంచి ఒర్రెలో వచ్చే నీటితో ఎండకాలంల పదెకరాలు పండించానని, ఈ యేడు నీళ్లు రాక మొత్తం ఎండిపోయిందని వాపోయాడు. కరెంట్ సరిగ్గా లేక మోటర్లు కాలిపోతున్నాయని, నీళ్లు రాక పదెకరాల్లో నాలుగెకరాల వరి ఎండిపోయిందని మల్లాపూర్ రైతులు చల్ల వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి గోడును వెల్లబోసుకున్నారు. 'సార్ మీ పాలనలోనే బాగుండె. ఇప్పుడు కనీసం నీళ్లు లేవు, సరిగ్గా కరెంటు లేక ఇబ్బందులు పడుతున్నం' అని బోయినపల్లి చెందిన రైతులు సుధాకర్, నాగరాజు, రమేశ్ చెప్పుకొచ్చారు. వారి బాధలు విన్న కేసీఆర్ 'మీ కష్టాల్లో నేను పాలుపంచుకుంటా.. కొట్లాడుదామా?' అని పిలుపినివ్వగా, వారంతా మద్దతు పలికారు.

# సజీవధారలు ఎడారులైనయ్

- ఉమ్మడి జిల్లాలో నాడు నాలుగు జలధారలు సృష్టించినం
- సాగు, తాగు నీటికి ఇబ్బందుల్లేకుండా చూసినం
- ఐదారేండ్లుగా ప్రజలు ఆ ఫలాలు అనుభవించిన్రు
- ఇప్పుడేమైంది..? అన్నీ ఎండబెట్టింది..?
- కాంగ్రెస్ సర్కారుపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఫైర్
- అసమర్థ పాలన, అవివేక విధానాలతో అన్నీ ఎండినయని ఆగ్రహం



ఎండిన పొలాలకు సంబంధించిన ఫొటోలను చూపుతున్న కేసీఆర్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణను సస్యశ్యామలం చేయాలని, దశాబ్దాల కరువును దూరం చేయాలని కాళేశ్వరం ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నాలుగు సజీవ జలధారలు సృష్టించామని, కానీ, కాంగ్రెస్ సర్కారు అసమర్థత పాలనలో అవి ఎడారులుగా మారాయని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. 2014కు ముందు ఉన్న పరిస్థితులే మళ్లీ పునరావృతమైతున్నాయని,. ఎక్కడ చూసినా కాలిపోయిన మోటర్లు, నీళ్ల ట్యాంకర్లు, ఎండిపోయిన పంటలు, నీళ్ల కోసం ప్రజలు ఎదురుచూస్తున్న దృశ్యాలు మళ్లీ కనిపిస్తున్నాయని ఆవేదన చెందారు. నీటి నిర్వహణ తెల్వని లత్కోర్లు, చవట దద్దమ్మలు రాజ్యమేలుతున్న కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని ఆగ్రహించారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, ప్రభుత్వం తెచ్చిన కరువేనని ధ్వజమెత్తారు. కొన్ని రోజుల ముందే నీళ్లు వదిలి ఉంటే ప్రతి గ్రామంలో పంట మనకు దక్కేదన్నారు. సమయానికి నీళ్లు వదలక, కరెంటు ఇవ్వక, రైతుబంధు ఖాతాలో వేయక ప్రజలను ఇబ్బంది పెట్టడంతోనే ఈ దుస్థితి వచ్చిందని విమర్శించారు. మీ వెర్రివేషాల కారణంగా వ్యవసాయం సంక్షోభంలో చిక్కుకున్నదని, మిమ్మల్ని వేటాడి, వెంటాడి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చేస్తామని హెచ్చరించారు. పొలంబాటలో భాగంగా శుక్రవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఎండిన పంటలను పరిశీలించిన కేసీఆర్, సాయంత్రం ఆరు గంటలకు సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బోయినపల్లిలో రైతులు తెచ్చిన ఎండిపోయిన పంటల ఫొటోలను కేటీఆర్ తీసుకొచ్చి ఇవ్వగా.. వేదికపై ఆ చిత్రాలను చూపిస్తూ పరిస్థితిని వివరించారు. నాడు ఉద్యమంలో మేం ఏదైతే అనుకున్నమో.. మేం అధికారంలోకి రాగానే అవన్నీ పూర్తి చేశామని, ఈ క్రమంలోనే కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు సాగు, తాగునీటికి ఢోకా లేకుండా చేశామని గుర్తు చేశారు. ఆయన మాటల్లోనే..

- ఎంతో కష్టపడి కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసినం. ఉమ్మడి జిల్లాకు ఏ ఢోకా లేకుండా నాలుగు సజీవ జలధారలను సృష్టించినం. అవి నిరంతరం ఈ జిల్లాను కాపాడినయి. వాటిని యావత్తు కరీంనగర్ జిల్లా ప్రజానీకం కండ్లారా చూసిన్రు. ఫలితాన్ని అనుభవించిన్రు.
- అందులో ఒకటి మానేరు వాగు. అప్పర్ మానేరు జలాశయం వద్ద మొదలై మధ్యమానేరు, దిగువ మానేరు మీదుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరి మీద నిర్మించిన అన్నారం (సరస్వతీ) బరాజ్ వద్ద కలిసే వరకు నది మొత్తాన్ని సజీవంగా మార్చినం. చెక్‌డ్యాంలు కట్టి ఎడాది పొడవునా నీరుండేలా నిండుకుండలా తయారు చేసినం. మానేరు పరీవాహకంలో సాగు, తాగుకు ఢోకా లేకుండా చేసినం.
- ఇంకోటి వరదకాలువ. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న వరద కాలువను కంప్లీట్ చేయడమే కాకుండా శ్రీరాంసాగర్ పునర్జీవ పథకం కింద ఆ వరదకాలువనే రిజర్వాయర్‌గా మార్చినం. ఒకటిన్నర టీఎంసీల నీళ్లు సంవత్సరం పొడవునా ఉండేలా మూడు పంప్‌హౌస్‌లు కట్టి, కాళేశ్వరం నీటిని ఎగువకు ఎత్తిపోసి సజీవధారగా మార్చినం.
- మూడోది కాకతీయ కాలువ. ఎస్సారెస్పీ నుంచి వచ్చే నీరు జిల్లా నలుమూలలా ఏడాదికి తొమ్మిదిన్నర నెలల నుంచి పదిన్నర నెలల వరకు ప్రవహించేలా ఈ కెనాల్‌ను తయారు చేసినం.
- నాలుగో సజీవధారగా గోదావరిని తీర్చిదిద్దినం. బరాజ్‌లు, అసంపూర్తిగా ఉన్న ఎల్లంపల్లి లాంటి ప్రాజెక్టును పూర్తి చేసినం. ఎస్సారెస్పీకి పునర్జీవం తేవడం, ఏదైనా తక్కువపడితే కాళేశ్వరం నుంచి నింపుకునేలా గోదావరి నది 200 కిలోమీటర్ల పొడవునా సజీవంగా మార్చినం.
- ఈ నాలుగు సజీవజలధారలు ఐదారేండ్లుగా ప్రజలకు అమృతధారలుగా నిలిచినయి. వాటి ఫలాలను అనుభవించిన్రు. లక్షల టన్నుల ధాన్యం పండించిన్రు. పుష్కలంగా ఎంత కావాలంటే, అంత నీటిని వాడుకున్న కరీంనగర్ జిల్లా నాలుగునెలల్లోనే కరువు కోరల్లో చిక్కుకుంది. సజీవధారలు ఎడారులుగా మారినయి. గతంలో మిడ్‌మానేరు బ్రిడ్జి మీద నిల్చుని ఉంటే ఒక సముద్రం మధ్యన నిల్చున్న ఫీలింగ్ ఉండేది. కానీ, ఈ రోజు అది పూర్తిగా ఎండిపోయింది. ఆనాడు మునిగిపోయిన ఊర్లు కూడా తేలినయి. కాంగ్రెస్ వాళ్లు ఒక శ్మశానంలా, ఎడారిలా దాన్ని తయారు చేసిన్రు. లోయర్ మానేరు డ్యాం.. ఒకప్పుడు ఎంత అద్భుతంగా ఉండె. మే నెల తర్వాత కూడా సగం నిండే ఉండేది. కరీంనగర్, సిద్దిపేటతోపాటు చుట్టూ ఉన్న పట్టణాలకు ఎంత కావాలంటే అంత నీరు అందించిన రిజర్వాయర్ నేడు ఎడారిగా మారింది. కరీంనగర్ నగర ప్రజలకు తాగు నీటి కటకట మొదలైంది. నేను ఈ రోజు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఇంట్లో భోజనం చేస్తుంటే, మేయర్, కార్పొరేటర్లు వచ్చి నగరానికి మంచినీళ్లు వస్తలేవని బాధపడ్డరు. ఆల్టర్‌నేటివ్ డేస్‌లో ఇస్తున్నరని, ఇంకా కొన్ని రోజులు గడిస్తే మూడు రోజులకొకసారి నీళ్లు వస్తయని వాపోయారు. ఎందుకీ పరిస్థితి వచ్చింది. ఈ సమస్యలన్నీ ఎందుకు వచ్చినయ్? కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఎడారికిగా ఎందుకు మారింది? పంటలు ఎందుకు ఎండిపోతున్నయి? మొన్నటిదాకా వచ్చిన నీళ్లు ఎటుపోయినయి? ఇదంతా ప్రభుత్వం అసమర్థ, అవివేక, చవట విధానాలు, అర్భకత్వం వల్ల ఈ దరిద్రం మన రాష్ట్రానికి వచ్చింది.

# నేతన్నలూ.. అండగా ఉంటా



సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ యజమానులు, కార్మికులు, కార్మిక సంఘాల నేతలతో చర్చిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

- వస్త్ర పరిశ్రమకు రావాల్సిన బకాయిలపై కోర్టులో దావా వేస్తా
- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ భరోసా
- నేటి నేతన్న గర్జన సభకు మద్దతు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : 'సిరిసిల్ల నేతన్నలు అధైర్య పడకండి. మీకు అండగా నేనున్నా. మీ బాధలు తీర్చే వరకు అండగా ఉంటా' అంటూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ధైర్యం చెప్పారు. ఈ నెల 6న శనివారం నిర్వహిస్తున్న నేతన్న గర్జన సభకు మద్దతు ఇస్తామని, సభలో బీఆర్‌ఎస్ నేతలు పాల్గొంటారని చెప్పారు. నేతన్న గర్జన సభతో ప్రభుత్వం దిగిరాకుంటే హైకోర్టులో దావా వేసి, ప్రతి ఊరిలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. చేనేత కార్మికులున్న చోట ఆందోళనలు చేపట్టి రాష్ట్రమంతా రణరంగం చేసి, ఫుట్‌బాల్ ఆడుతామని స్పష్టం చేశారు. అడ్వొకేటుగా మీరే కోర్టులో నేతన్నల పక్షాన కేసు వేయాలని పక్కనే ఉన్న బీఆర్‌ఎస్ కరీంనగర్ అభ్యర్థి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌ను ఆదేశించారు. వకీలు ఫీజులు పార్టీ భరిస్తుందని, భయపడేదేమీ లేదన్నారు. కోర్టుకు గుంజుదామని, కొట్లాడుదామని భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆయన పంటల పరిశీలన అనంతరం, సిరిసిల్ల తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. సాయంత్రం 5 గంటల వరకు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ముఖ్య నాయకులతో కాసేపు ముచ్చటించారు. తర్వాత సిరిసిల్ల నేతన్నల సమస్యలపై వస్త్ర ఉత్పత్తిదారులు, యజమానులు, కార్మిక సంఘాల నాయకులతో సమావేశమై, మాట్లాడారు. 'సిరిసిల్లలో నేత కార్మికులు సచ్చిపోయే పరిస్థితి ఉందని, ఆత్మహత్యలు మళ్లీ మొదలవుతాయని అడిగితే.. కాంగ్రెసోడు ఇచ్చిన సమాధానం ఏంటి? ఏం పోయింది. నిరోధ్‌లు, పాపుడాలు అమ్ముకుని బతుకమంటడు. మీరు మనుషులేనా..? లక్షలాదిగా ఉన్న చేనేత కార్మికుల మనోభావాలు దెబ్బతీస్తారా?'' అంటూ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఫైర్ అయ్యారు. 'మీరు ఇస్తే ఇవ్వండి. చేతకాక పోతే ఇవ్వకండి. కానీ, ఇలా మాట్లాడితే చేనేత కార్మికులే పులులై గర్జించి మిమ్మల్ని తరిమికొడుతరు' అంటూ కాంగ్రెస్ నేతల్ని హెచ్చరించారు. వెంటనే బతుకమ్మ చీరెలు, స్కూల్ యూనిఫాంలు, ఏమున్నా బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వస్త్ర పరిశ్రమకు రావాల్సిన పెండింగ్ బకాయిల కోసం హైకోర్టులో కేసు వేసి ప్రభుత్వం సంగతి తేలుస్తానని వస్త్ర యజమానులకు ధైర్యం చెప్పారు.

## పర్యటన ఇలా..

కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో ఎండిన పొలాలను పరిశీలించేందుకు మధ్యాహ్నం ఒంటి గంటకు వచ్చిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆ గ్రామ రైతుల బాధలు విన్నారు. అనంతరం ఎండిన పొలాలను పరిశీలించారు. తర్వాత కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసానికి చేరుకుని, భోజనం చేశారు. అనంతరం గంగాధర మీదుగా బోయినపల్లికి చేరుకున్నారు. మధ్యాహ్నం 3.42 గంటలకు ఎండిన పంట పొలం వద్దకు చేరుకొని రైతులతో మాట్లాడారు. తర్వాత మధ్యాహ్నం 3.56 గంటలకు వరకు శ్రీరాజరాజేశ్వర జలాశయం శాభాష్‌పల్లి వంతెన వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి జలాలను పరిశీలించారు. అనంతరం బస్సు దిగి కారులో సిరిసిల్లకు చేరుకున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి 7.03 గంటల వరకు మీడియాతో మాట్లాడారు.